

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

విలసవిల్లి నెంబర్ 184, 185, 186, గొల్లవిల్లిలో 213, 214 పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహశీల్దార్ జువ్విది వెంకటేశ్వరి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు మార్పులు చేర్పులు సవరణ చేసుకోవడానికి రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపైన్ ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. వచ్చే నెలలో మరో రెండో రోజులపాటు ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


గొల్లవిల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

పాలకుల మాయమాటల్ని గమనించాలి

- బిజెపితో భారత రాజ్యాంగానికి తూట్లు
- వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రజలకు ఏం చేస్తున్నాయో తెలపాలి
- సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్రలో వక్తలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పాలకులు చెబుతున్న మాయమాటలను, మోసపూరిత ప్రకటనలను, హామీలను ప్రజలు గమనించాలని సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్రలో పలువురు వక్తలు అన్నారు. ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర ఆదివారం కాకినాడ జిల్లాకు చేరుకుంది. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చిన యాత్ర బృందానికి తుని గొల్ల అప్పారావు సెంటర్లో ఘనంగా స్వాగతం లభించింది. సిపిఎం, సిఐటియు, అంగన్వాడీ, ఆశ జీడి పిక్కల పరిశ్రమ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై యాత్ర నాయకులకు పూలమాలలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి అన్నవరం, కత్తిపూడి,చేబ్రోలు, గొల్లప్రోలు మీదుగా సాయంత్రం పిఠాపురం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా బహిరంగ సభ జరిగింది. అక్కడ నుంచి కాకినాడ రూరల్ తిమ్మాపురం, సర్పవరం, బాలాజీ చెరువు జంక్షన్ మీదుగా కాకినాడ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఉన్న ట్రస్ట్ స్టాండ్ వద్దకు చేరుకుంది.

సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం మాట్లాడారు. బిజెపి వల్ల దేశానికి, రాష్ట్రానికి ఏ విధంగా అన్యాయం జరుగుతుందో ప్రజలకు తెలియజేసి పలు ప్రత్యామ్నాయాలను సూచించేందుకే ఈ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదానీ, అంబానీ, రిలయన్స్ వంటి బడా సంస్థలకు దేశ సంపదను కట్టబెడుతున్న వైనాన్ని ఆయన సభలో వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న ద్రోహాన్ని వివరించారు. సిపిఎం సూచిస్తున్న ప్రత్యామ్నాయంలో భాగంగా నిరుపేదలకు రెండున్నర ఎకరాలు భూములు పంచాలని డిమాండ్ చేశారు. ఎటువంటి భారాలు లేకుండా ఇళ్లను నిర్మించి ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ స్కీమును అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2.40 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయని పక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న వైనాన్ని వివరించారు. ప్రజలపై చార్జీల భారం విపరీతంగా పెరుగుతుందన్నారు. 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను, రాజకీయ పరిణామాలను వివరిస్తూ బస్సు యాత్ర సాగుతుందన్నారు. విభజన హామీలను ఏమాత్రం అమలు చేయని బిజెపిని అందరూ వ్యతిరేకించాలన్నారు. జిల్లాలో అపారమైన గ్యాస్, చమురు నిక్షేపాలున్నా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి. నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో అనేక అసమానతలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయన్నారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందడం లేదన్నారు. ఒక్క రూపాయికే యూనిట్ విద్యుత్, రూ.400కే గ్యాస్ ఇవ్వవచ్చని సిపిఎం సూచిస్తున్న ప్రత్యామ్నాయాలను ప్రజలు ఆలోచించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రూ.600 వేతనంగా ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలన్నారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం సిఎం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కరువు మండలాల ప్రకటనలో కూడా అన్యాయం చేశారన్నారు. 98 శాతం హామీలను అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ స్కీం వర్కర్లకు కనీస వేతనాలను ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఇలా అనేక అంశాలను విస్మరించి జగన్ మాట తప్పారని ఎద్దేవా చేశారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ రౌతులపూడి మండలంలో సబ్ ప్లాన్ గిరిజనుల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదన్నారు. ఎనిమిది మండలాల్లో ఏలేరు రైతులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. కాకినాడ సెజ్ భూముల రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించలేదన్నారు. దివీస్ కంపెనీని బంగాళాఖాతంలో కలిపేస్తామన్న జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కంపెనీకి వత్తాసు పలుకుతున్నారన్నారు. మెట్ట మండలాల్లో పెద్ద ఎత్తున కరువు పరిస్థితులు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పిఠాపురం, కాకినాడ సభల్లో ప్రయాణికులు, వాహన చోదకులు, వ్యాపారులు ఆద్యంతం నాయకుల ప్రసంగాలను ఆలకించారు. ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఉపాధ్యాయులు ఆయా సమస్యలపై యాత్ర బృందానికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు దువ్వా శేషబాబ్జీ, జి.బేబీరాణి, కెవిఎస్.శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు బాలకృష్ణ, కె.సింహాచలం, కుంచె చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, సిహెచ్ రమణి, పద్మ, ఈశ్వరి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న మంతెన సీతారాం



ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు 'రండి కదలిరండి' అంటూ ప్రదర్శించిన నత్య రూపకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నయవంచన పాలనను వివరించారు. జగన్, చంద్రబాబు, పవన్ ల మూడు ముక్కలాట వ్యవహార శైలిని సామాన్య ప్రజలకు సైతం అర్ధమయ్యేలా నత్యం ప్రదర్శించారు.

బాణసంచా కేంద్రాలకు అనుమతి తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి అమలాపురం

బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలకు అనుమతులు తప్పని సరి అని, అనుమతులు లేని నిర్వాహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఎస్.శ్రీధర్ స్పష్టం చేశారు. అనుమతులు ఉన్న వారు మాత్రమే బాణసంచా సామగ్రిని అమ్మాలన్నారు. ప్రమాదాలు నివారణకు తగిన నిబంధనలు పాటించాలన్నారు. బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో పనిచేసే వారికి ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగించాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డుల్లో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజల నివాసాలకు, విద్యాసంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా అమ్మకాలు నిర్వహించాలి. నీరు, పొడి ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలి. బాణాసంచా తయారీ కేంద్రాల్లో పగటిపూట మాత్రమే బాణసంచా సామగ్రిని తయారు చేయాలన్నారు. మైనర్లతో పనులు చేయించరాదన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలన్నారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101 లేదా పోలీస్ డయల్ 100/112లకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


ఆలమూరులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ ముక్కంటి

ఓటరు జాబితాల ప్రదర్శన

ప్రజాశక్తి - ఆలమూరు

ఓటర్ల పరిశీలనార్థం ఓటరు జాబితాలను ప్రదర్శిస్తున్నామని, దీన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మండల అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్థానిక తహశీల్దార్ ఐపి.శెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. ముందుగా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్లు ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కల్పించడంతోపాటు ఇదివరకు ఓటు హక్కు ఉన్న వారి పేరు జాబితాలో ఉందో.. లేదో.. తెలుసుకోవాలన్నారు. పేరు, చిరునామా తదితర మార్పుల సవరణకు అవకాశం ఇచ్చారన్నారు. జాబితాలో పేర్లు లేకుంటే డిసెంబర్ 9 లోపు స్థానిక బూత్‌లెవెల్ ఆఫీసర్ల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాసంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - మండపేట

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సిఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. ఆదివారం మండలంలోని కేశవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పతివాడ దుర్గారాణి, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎంపిపి వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ తదితరులతో కలిసి గ్రామంలోని మెరకవీధిలో పర్యటించారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందించారు. ఎంపిడిఒ ఐదం రాజు, ఇఒ సుబ్బారావుతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే పథకాలను తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపిటిసి సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, నాయకులు తులా శేషారావు, పెదపాటి ఉమామహేశ్వరావు, కోప్పిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో ట్రాఫిక్ కష్టాలు

- పట్టణంలోనూ భారీ వాహనాల రాకపోకలు
- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - మండపేట

పెరుగుతున్న జనాభాతో పాటు రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న మండపేట పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ప్రతి రోజూ ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో రోజురోజుకూ ఈ సమస్య పెరిగిపోతోంది. సుమారు 25 గ్రామాల నుంచి ప్రజలు ప్రతిరోజూ ఏదొక పనిపై పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు, ప్రజల రాకపోకలతో ప్రధాన కూడళ్లు ట్రాఫిక్ చక్రబంధనంలో చిక్కుకుంటున్నాయి.


మండపేట మెయిన్ రోడ్డులో వాహనాలతో నిలిచిపోయిన ట్రాఫిక్

పట్టణంలోనూ భారీ వాహనాల రాకపోకలు

నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు సైతం పట్టణంలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు కిలోమీటర్ల మేర ఉన్న మండపేట బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాల్సిన భారీ వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు పట్టణ నడిబొడ్డులోని ప్రధాన రహదారి మీదుగా వెళ్లడంతో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. భారీ వాహనాల కొట్టే హారన్లతో శబ్దకాలుష్యంతో ఆసుపత్రులలోని రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అంతేకాకుండా స్థానిక కపిలేశ్వరపురం రోడ్డుమీదికి వ్యాపారాలు విస్తరిస్తుండంతో అటు పాదచారులు ఇటు ద్విచక్రవాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. దీంతో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు నిరూపయోగంగా మారిందని ప్రజలు అంటున్నారు.

ఇటీవల కాలంలో భారీ వాహనాల డ్రైవర్లతో పాటు ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్రవాహనదారులు ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుతున్నారు. అంతేకాకుండా మోటర్‌సైకిల్‌పై కొన్ని సమయాల్లో ముగ్గురు మరికొన్ని సమయాల్లో నలుగురు యువకులు వెళుతుండటం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. దాని కోసం పోలీసులు చర్యలు చేపడతున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం..

తరచు ట్రాఫిక్‌కు అంతరాయం

సుమారు 60 వేల జనాభా ఉన్న మండపేట పట్టణంలో ప్రధాన కూడళ్ల ట్రాఫిక్ ఐలాండ్స్ అభివృద్ధి చేయాలని గతంలో కౌన్సిల్ తీర్మానం చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పెరుగుతున్న ట్రాఫిక్ పట్టణ పోలీసులకు పెద్ద సమస్యగా మారింది. ప్రధానంగా కలువపువ్వు సెంటర్, కరాచి, రాజారత్న, ఆదిత్య కాలేజ్, మారేడుబాక వంతెన తదితర జంక్షన్ల వద్ద నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఈ ప్రాంతాల్లో తప్పనిసరిగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం రద్దీగా ఉండే కూడళ్లలోనైనా సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. లోడింగ్ అన్ లోడింగ్ సమయపాలన లేకపోవడం గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు అంటున్నారు. దీంతోపాటు ఇరుకు మార్గంగా ఉన్న స్థానిక సత్యశ్రీ రోడ్డును విస్తరించాలని పలువురు కోరుచున్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్.ఐ అశోక్‌ను వివరణ కోరగా పట్టణ పరిధిలోని ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. అనుమతి లేకుండా పట్టణంలో నుంచి వెళుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై పర్యవేక్షణ కరువు



మండపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై పర్యవేక్షణ కొరవడింది. ఏడిద జంక్షన్, రాజరత్న బైపాస్ రోడ్డులలో వెళ్లాల్సిన భారీ వాహనాలు,లారీలు, ట్రాక్టర్లు పట్టణంలోని కపిలేశ్వరపురం రోడ్డు, మెయిన్ రోడ్డులోని బస్టాండ్ మీదుగా వెళుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిక్కిరిసిపోతున్న జంక్షన్‌లలో భారీ వాహనాలు మోగించే హారన్‌లతో స్థానిక ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రుల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

- కె.కృష్ణవేణి, సిఐటియు జిల్లా కార్యదర్శి, మండపేట

అరాచక పాలనకు ఓటుతో బుద్ధి

ప్రజాశక్తి - మండపేట


మాచవరంలో నాయకులతో ఎంఎల్ఎ వేగుళ్ల

రాష్ట్రంలో అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెబుదామని, టిడిపి అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాయవరం మండలంలోని మాచ వరంలో 3వ రోజు ఆదివారం 'బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబు సిఎం కాగానే మహిళా శక్తి పథకాలు అమలు చేసి మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. వైసిపి పాలనలో విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్యుల జీవనం భారంగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు

చారిత్రాత్మక నిర్ణయం : ఎంఎల్‌సి ఇజ్రాయిల్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న అక్రిడియేటెడ్ జర్నలిస్టులకు 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటం ఒక చారిత్రాత్మక నిర్ణయమని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరగా వైఎస్ఆర్ తరువాత మళ్లీ జర్నలిస్టులకు గృహవసతి గురించి ఆలోచించింది ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి మాత్రమేనన్నారు. ఆయన తన పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన హామీని నెరవేర్చారన్నారు. వేలాది మంది జర్నలిస్టుల కుటుంబాలకు లబ్ది చేకూర్చే విధంగా మంచి నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో పాటు ఆయన కేబినెట్ సహచరులకు అభినందనలు తెలియజేశారు. పార్టీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి చేరే విధంగా ప్రతి ఒక్క జర్నలిస్టు కృషిచేసి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా సహకరిస్తారని ఆశించారు.

బాధితులకు జనసేన అండ

ప్రజాశక్తి - ఆలమూరు

బాధితులు ఎవరైనా వారికి జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను ఆయన ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. ఇందులో భాగంగా భువనేశ్వరి చెరువు సమీప నివాసి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గోడితి రాంబాబు తల్లి రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో రాంబాబును ఆయన కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జనసేన నేతలు తాళ్ల డేవిడ్, సలాది జయప్రకాష్, చల్లా బాబి, చల్లా వెంకటేశ్వరరావు, సిరిగినేడి పట్టాభి, కట్ట రాజు, దాసి మోహన్, దాసరి వీరపండు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోవిందుని కళ్యాణం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న 11 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం శ్రీనివాస కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాద ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఆలయ ఇఒ సత్యనారాయణరాజు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు రాత్రి స్వామివారిని సింహ వాహనంపై మాఢవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది యాత్రికులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. వారికి అన్ని ఏర్పాట్లూ చేశామని ఆలయ చైర్మన్, ఇఒ తెలిపారు.

కార్టూ'నిజం'




మంత్రి వేణును సత్కరిస్తున్న పాత్రికేయులు

మంత్రి వేణుకు పాత్రికేయుల సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్‌లో నిర్ణయించడంపై రామచంద్రపురంలో విలేకరులు ఆదివారం బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను కలిసి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయించడంపై విలేకరులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కోటిపల్లి రేవులో అనధికార పంటుల నిర్వహణపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటిపల్లి రేవులో జరుగుతున్న అక్రమాలపై మాత్రమే వార్తను రాశామని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల వివరణ సైతం తీసుకుని ప్రచురించామని విలేకరి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ మంత్రి పట్టించుకోకుండా ఆగ్రహంతో ఊగిపోయారు. అవినీతి కథనంపై మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ మాట్లాడటంపై అక్కడివారంతా విస్తుపోయారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మండల కార్యాలయానికి కూతవేటు దూరంలో రహదారిపై భారీగా వర్షపు నీరు నిలవడంతో ప్రధాన రహదారి జలమయం అయ్యింది. ఆ రహదారి మీదుగా కార్యాలయానికి, వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక తదితర ప్రాంతాలకు ప్రయాణికులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వర్షానికి రోడ్డు గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఈ రహదారి గోతులు పూడ్చాలని వాహనదారులు, ప్రయాణీకులు కోరుతున్నారు.


అయినవిల్లి మండల కార్యాలయం రోడ్డులో నిలిచిన నీరు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన గొర్తి శ్రీవైష్ణవికి డిగ్రీ మొదటి సంవత్సరం ఫీజు నిమిత్తం రూ.5వేలను అబ్బిరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా సమకూర్చారు. విద్యార్థిని తండ్రి పౌరోహిత్యం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలో చదివించే స్థోమత లేక ట్రస్ట్ అధ్యక్షులు అబ్బిరెడ్డి సురేష్ ఆశ్రయించాడు. దీంతో విద్యార్థినికి అమలాపురం మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయులు మలిశెట్టి మూర్తి మాష్టారు చేతుల మీదుగా సాయం అందించారు. చదువు ఫీజుల నిమిత్తం ఏ విద్యార్థి ఇబ్బంది పడకూడదని, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత దాతలు తీసుకోవాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో గంగుమళ్ల శ్రీనివాస్, దూడల ఫణీంద్ర, చవటపల్లి కిషోర్, పోలిశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి సతీష్ కుమార్

చోరీ కేసుల్లో నిందితుని అరెస్టు

రూ.25 లక్షల ఆభరణాల స్వాధీనం

ప్రజాశక్తి-కాకినాడ

ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుని, అతనికి సహకరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి ఎస్.సతీష్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల జిల్లాలో పలుచోట్ల ఇళ్లలో చోరీలు తరచుగా జరుగుతున్న క్రమంలో జిల్లాలోని అధికారులందరినీ అప్రమత్తం చేశామన్నారు. అడిషనల్ ఎస్పి పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో పెద్దాపురం డిఎస్పి కె.లతాకుమారి ఆధ్వర్యంలో ప్రతిపాడు సిఐ ఎం.శేఖర్ బాబు, ఏలేశ్వరం ఎస్ఐ ఎస్.సతీష్ దర్యాప్తు చేపట్టారన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతాలైన ఏలేశ్వరం ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్న అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావును అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. గతంలో 8 ఇంటి దొంగతనాల చోరీ కేసుల్లో రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్షలు అనుభవించి, ప్రవర్తన మార్చుకోకుండా కాకినాడ జిల్లాలో 13 తాళం వేసివున్న ఇళ్లలో భారీ, చిన్న తరహా చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. వాటిలో కొన్ని ఆభరణాలను అమ్మి సొమ్ము చేసుకుని తన వ్యసనాల నిమిత్తం వాడుకోగా మిగిలిన బంగారు ఆభరణాలను తండ్రి ఏసుబాబు, తన స్నేహితులు తరోజు నాగదుర్గ, మిడతది అఖిల్ కుమార్, కొల్లూరి చిట్టిబాబులతో ఏలేశ్వరం ఎస్బిఐ, సిఎస్బి, యూనియన్ బ్యాంకుల్లో, ఏలేశ్వరం ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టించాడన్నారు. పైన పేర్కొన్న బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల నుంచి 471.4 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వేలచింతలగూడెం శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.13,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

సాగునీరందక ఎండుతున్న పొలాలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామ పరిధిలోని శివారు భూముల్లో సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. వ్యవసాయ పెట్టుబడులన్నీ పూర్తయిన తర్వాత పంట పండి చేతికొచ్చే తరుణంలో నీటి వసతి లేకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. పుష్కర కాలువ ద్వారా నీటి సరఫరా జరగకపోవడం, కాండ్రకోటలోని దబ్బ కాలువ బెడ్ రెగ్యులేటర్ లేకపోవడంతో కొంతమేర భూములకు సాగునీటి సమస్య వచ్చిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాండ్రకోట గ్రామానికి చెందిన గవరసాన సూర్యనారాయణ, వీర్రాజు అనే రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాగునీరందించండి వరి పంట చేతికందే తరుణంలో సాగునీరందక వరి పొలాలు ఎండిపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందున వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించే ఏర్పాటు చేయాలని కాండ్రకోట గ్రామానికి చెందిన చల్లా బత్తుల వెంకన్న అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను ఆదుకోండి

ఈ ఏడాది వ్యవసాయ పెట్టుబడులు అధికమయ్యాయని, వరిలో అన్ని రకాల పెట్టుబడులు పూర్తయిన తర్వాత తీవ్ర నీటి ఎద్దడి వల్ల కళ్ళ ముందే వరి చేలు ఎండిపోతున్నాయని కాండ్రకోట గ్రామానికి చెందిన పంచాది పద్మరాజు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పంటల పరిస్థితిని పరిశీలించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


సాగునీరందక ఎండిపోయిన వరి చేను


కాకినాడలో ఓటర్ల శిబిరాన్ని సందర్శించిన ఇఆర్ఓ నాగ నరసింహారావు

అర్హులైన అందరికీ ఓటు హక్కు

ప్రజాశక్తి-కాకినాడ

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో పని చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఓ, కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా ఆదివారం జరుగుతోన్న ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలను ఆయన సందర్శించారు. రామారావుపేట, ఎంఎస్ఎన్ చార్టీస్, పివిఆర్ ట్రస్ట్ డిగ్రీ కళాశాల, జగన్నాథపురం, చిన్నమార్కెట్ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లకు వెళ్ళి అక్కడి ప్రత్యేక శిబిరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పోలింగ్ సిబ్బంది, బిఎల్ఓలకు పలు సూచనలు ఇచ్చారు. దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రత్యేక దష్టిసారించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, పలువురు అధికారులు, బిఎల్ఓలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

పెద్దాపురం: పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా ఆదివారం ఆర్డిఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.సీతారామయ్య పెద్దాపురం మండలం, సామర్లకోట మండల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్త ఓటర్ నమోదుకు వచ్చిన దరఖాస్తులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డిసెంబర్ 2, 3 తేదీలలో కూడా కొనసాగుతుందన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవచ్చన్నారు. అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సామర్లకోట రూరల్ : పెద్దాపురం ఆర్డిఓ, ఇఆర్ఓ జె.సీతారామారావు ఆదివారం ఉండూరు, గొంచాల, నవర, చంద్రంపాలెం గ్రామాల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో చేపట్టాల్సిన చర్యలు, పోలింగ్ సిబ్బంది, బిఎల్ఒల పనితీరుపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఓటర్ల జాబితా సవరణపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరప : కరప నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను ఆదివారం తహాశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు నమోదు ప్రక్రియలో రెండు రోజులలో 432 మంది ఓటు హక్కు కోసం సంబంధిత పత్రాలు సమర్పించినట్టు ఆయన తెలిపారు.

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-పెదపూడి

అక్రిడేషన్ తో సంబంధం లేకుండా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదం తెల్పినందుకు ఆదివారం పెదపూడిలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని పెదపూడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం సిఎం వైఎస్.జగన్ చిత్రపటానికి జర్నలిస్టులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎపిడబ్లుజెఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లుమల్లు ఏలియా, షేక్ సలీమ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేస్వర రావు, సమ్మంగి దుర్గాప్రసాద్, పెదపూడి, బిక్కవోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వల్లూరి చిన్ని, షేక్ ఉస్మాన్ బాషా, పాత్రికేయులు నల్లమిల్లి అనంత కృష్ణా రెడ్డి, ఆరుమిల్లి శ్రీను, వారణాసి శ్రీను, వాసంశెట్టి సూరిబాబు, షేక్ వల్లి, కర్రి సత్తిబాబు, కాకరపల్లి శ్రీను, సత్య, రాజబాబు, అశోక్, రాధాకృష్ణ పాల్గొన్నారు.


సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విలేకరులు


యాత్రలో వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆశా వర్కర్స్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కాకినాడ

ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్స్‌కు రూ.పది వేలు జీతం ఇస్తున్నామని, సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పని ఒత్తిడి పెంచేసి వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు చెల్లా రత్నం, వెంకట లక్ష్మి, సుజాత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

దళితులపై దాడులను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మామిడికుదురు మండల టిడిపి శ్రేణులు ఆదివారం పేర్కొన్నారు. ఎస్సి సెల్ నాయకులు జాలం సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారుర. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నగరం సర్పంచ్ జాలం రమణకుమారి, జాలం రాంబాబు పాల్గొన్నారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరంలో ఆర్ఎంపి వైద్యులు ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మందిని శస్త్ర చికిత్స కోసం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో డిఎంఆర్ శేఖర్, పితాని బాలకృష్ణ, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రసాద్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. సానబోయిన మల్లికార్జునరావు, అత్తిలి బాబురావు, ముత్యాల జయలక్ష్మి, ముత్యాల బోసు, విళ్ల సత్యనారాయణ, వాణి విద్యానికేతన అధినేత చంద్రశేఖర్, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

చక్రపాణి చిత్రానికి గుర్తింపు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరునికి చెందిన చిత్రకారుడు చక్రపాణి గీసిన శ్రామిక జీవన సౌందర్యం చిత్రానికి మంచి గుర్తింపు లభించింది. చోడవరం చిత్రకళా నిలయం నిర్వహించిన 6వ ఆర్ట్ కాంపిటీషన్‌లో చక్రపాణి చిత్రీకరించిన శ్రామిక జీవన సౌందర్యం చిత్రం టాప్ 10లో ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా చిత్రకారుడు చక్రపాణిని చిత్రకళ నిలయం వ్యవస్థాపకుడు బొడ్డేటి సూర్యనారాయణ, అటవీ శాఖ అధికారి రామ్ నరేష్ తదితరులు మెమెంటోతో పాటు దుస్సాలువా కప్పి సత్కరించారు. చిత్రకారుడు చక్రపాణికి ఏలేశ్వరానికి చెందిన పలువురు ప్రముఖులు, కళాకారులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

బాణసంచా కేంద్రాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - ఆలమూరు

బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ స్పష్టం చేశారు. దీపావళి నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిబంధనలను పాటించాలన్నారు. బాణాసంచా నిల్వచేసే నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. వాటిలో విధులు నిర్వహించే వారికి అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా తయారు చేసినా, నిల్వ చేసినా చర్యలు తప్పవన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఆలమూరు

43 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక కొత్తూరు హైస్కూలులో చోటు చేసుకుంది. 1979-80 ఏడాది మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాల ఆవరణలోనే 43 ఏళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు. పూర్వపు విద్యార్థుల ఒకచోట చేర్చాలని ఆలోచనలో భాగంగా మిత్రులు కామవరపు మల్లికార్జునరావు, వెత్సా జవహర్లాల్ నెహ్రూ, గెద్దాడ రవీంద్రనాథ్, బొబ్బా ఆదినారాయణతో పాటు పలువురు చేసిన కృషితో వివిధ ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపారంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒక చోట చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రూ.లక్షా 50 వేలు సేకరించి డిపాజిట్ చేశారు. ప్రతీ ఏటా నవంబర్ 14 చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు క్రీడలు నిర్వహించి వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి లక్షా ఏభైవేల మీద వచ్చే వడ్డీతో బహుమతులు అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ప్రారంభానికి నోచని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

పనులు పూర్తి కావడం కోసం ప్రజలు ఎదురుచూపులు చూడాల్సి వచ్చేది, అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత కూడా ప్రారంభానికి నోచుకోని సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే సామర్లకోట మున్సిపాలిటీలో ఈ మధ్య కాలంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నా అధికారులు వాటికి ప్రారంభోత్సవాలు జరపడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్‌లు నేతల హరిబాబు, పితాని కృష్ణ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి స్థానిక ఎఫ్‌సిఐ గోదాముల రహదారి, నెంబర్ 2 మార్కెట్ రోడ్డు, అమ్మణ్నమ్మ కాలనీ రహదారి వంటి ప్రధాన అభివద్ధి పనులతో పాటు పలుచోట్ల డ్రెయిన్లు, రహదారులు, కల్వర్తులు నిర్మాణం పూర్తిచేసి కూడా వాటికి ప్రారంభోత్సవాలు ఎందుకు చేపట్టడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఏ అభివద్ధి పని చేపట్టినా శిలా ఫలకాలు ఏర్పాటు చేసి నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధుల పేరులతో పాటు స్థానిక కౌన్సిలర్ల పేరులను, అధికారుల పేరులను వేస్తూ వచ్చారన్నారు. అలాంటిది ప్రస్తుతం ఎన్నో అభివద్ధి పనులు జరుగుతున్నా వాటిని ఎందుకు ప్రారంభించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న పరిస్థితుల్లో ఎన్నికల కోడ్ వస్తే ఎలాంటి ప్రారంభోత్సవాలు చేసే వీలుండదన్నారు. అలాంటపుడు తమ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని రానున్న రోజుల్లో ప్రజలు ఏ విధంగా జ్ఞాపకం పెట్టుకుంటారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తయిన అభివద్ధి పనులకు శిలా ఫలకాలు ఏర్పాటు చేసి వాటికి ప్రారంభోత్సవాలు చేపట్టాలని కౌన్సిలర్లు హరిబాబు, పితాని కృష్ణ డిమాండ్ చేస్తున్నారు.


పూర్తయిన వీరరాఘపురం మార్కెట్ రోడ్


నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

దళితులపై రాజ్యహింసను నిలువరించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

ఎపిలో వైసిపి ప్రైవేట్ సైన్యంలా మారిపోయి తీవ్ర అరాచకవేత పాల్పడుతున్నారని మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతా కుమారి పేర్కొన్నారు. ఎస్సి సెల్ అధ్యక్షులు నాగబత్తుల వెంకట సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో దళితులపై దాడులను ఖండించారు బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సి సెల్ నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, నేదునూరి వీర్రాజు, బొండాడ నాగమణి, జల్లి బాలరాజు, చిన్నం బాల విజయారావు, పెదపూడి శ్రీనివాసరావు, మోత సత్తిబాబు, మంద రాజేష్, నేదునూరి వెంకటరమణ, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాలుని వైద్యానికి సిఎం నిధి

ప్రజాశక్తి - ఆలమూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాలుని వైద్య ఖర్చులకు రూ.19,50,000 ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మంజూరు చేయించారు. లివర్ వ్యాధితో బాధ పడుతున్న మండలంలోని సూర్యారావుపేటకు చెందిన టేకుమూడి సాయితేజను పరీక్షించిన డాక్టర్లు లివర్ మార్పిడి చేయాలని సూచించారు. ఆపరేషన్‌కు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పగా పేదవారైన అతని తల్లిదండ్రులు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డిని ఆశ్రయించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆపరేషన్ నిమిత్తం మొదట రూ.10 లక్షలు, తరువాత రూ.9 లక్షల 50 వేలు మంజూరు చేయించి ఆదివారం అందజేశారు. వీటికి తోడు చిర్ల తన వంతుగా రూ.20 వేలు అందచేశారు. ఈ సందర్భంగా బాలుని ఆపరేషన్ జరిగి పూర్తి ఆరోగ్యవంతునిగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి -రౌతులపూడి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో ఆదివారం వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ ఎందుకు అవసరం అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వైసిపి మండల అధ్యక్షులు జిగిరెడ్డి శ్రీను, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, డిసిసిబి డైరెక్టర్ పులి మధు ఉన్నారు.

ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రతి మనిషి ఆరోగ్యానికి వ్యాయామం అవసరమని జూనియర్ కళాశాల ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎండి సైపుల్లా అన్నారు. ప్రతి నెలా మొదటి ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్స్ లో గ్రౌండ్ ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ సైపుల్లా, సభ్యులు ఎం బుల్లి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో ఉచితంగా బిపి, షుగర్, బరువు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు గంట సతీష్ కుమార్, ఉండు కష్టారావు, విప్పర్తి కొండలరావు ,ఎస్ శ్రీనివాసరావు, జిలాని అధిక సంఖ్యలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ కాళరాత్రికి 27 ఏళ్లు..

కోనసీమను అతలాకుతలం చేసిన 1996 పెను తుపాను

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

నవంబరు 6 అంటే చాలు కోనసీమ ప్రజలకు టక్కున గుర్తొచ్చేది కోనసీమను అతలాకుతలం చేసిన 1996 నాటి పెను తుపాను. ఆ తుపాను మిగిల్చిన ఆ కాళరాత్రి జ్ఞాపకాలను కోనసీమ వాసులు నేటికీ మరిచిపోలేదు. ఎప్పటిలాగే ఆరోజు ఉదయం నుంచి వాతావరణం మామూలుగానే ఉంది. సాయంత్రం అయ్యేసరికి మబ్బులు పట్టి చిరుజల్లులు మొదలయ్యాయి. చీకటి పడే సమయానికి ఒక్కసారిగా భారీ వర్షంతో ప్రచండ గాలులు మొదలయ్యాయి. ఎలాంటి ముందస్తు తుపాను హెచ్చరికలు లేకపోవడంతో ప్రజలు ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. కొంత మంది అప్పటికే నిద్రకు ఉపక్రమించారు. ఊహించని రీతిలో వచ్చిన ఈ తుపాను బీభత్సానికి ప్రజలు అతలాకుతలమయ్యారు. అరచేతిలో ప్రాణాలు పట్టుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. సుమారు 215 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు విరుచుకుపడడంతో ఇళ్ల పైకప్పులు ఎగిరి ఎక్కడో పడ్డాయి. చెట్లతో పాటు లక్షలాది కొబ్బరి చెట్లు నేల కొరిగాయి. విద్యుత్ లైన్లు పూర్తిగా నేలకొరిగాయి. ప్రజలు చిమ్మ చీకట్లోనే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పక్కా భవనాల వైపు పరుగులు తీశారు. తెల్లారేసరికి కోనసీమ కకావికలమైంది. ఇప్పట్లో కోలుకోదని కోనసీమ వాసులు ఆందోళనకు గురయ్యారు అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో పక్కా భవనాలు ఎక్కువగా లేక ఎక్కువ శాతం పెంకుటిళ్లు, రేకుల షెడ్లు, తాటాకిళ్ళ లోనే కుటుంబాలు నివసిస్తుండడంతో ఎక్కువ ఇళ్లు ఈ తుపాను ధాటికి నేలమట్టమయ్యాయి. సుమారు రెండు లక్షల 25 వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు.1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో పశువులు, పక్షులు చనిపోగా 2.41 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంట పూర్తిగా దెబ్బతింది. 6.47 లక్షలకు పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. తుపాను దాటికి విద్యుత్, సమాచార రవాణా వ్యవస్థలు పూర్తిగా దెబ్బతినడంతో బాహ్య ప్రపంచంతో కోనసీమకు సంబంధాలు తెగిపోయాయి. కోనసీమలో ముఖ్యంగా ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అయినవిల్లి, అమలాపురం రూరల్, కొత్తపేట మండలాల్లో ఈ తుపానుకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుపాను తీరం దాటిన పది రోజుల తర్వాత కూడా చాలా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోయారు. ఇలాంటి ప్రాణ ఆస్తి నష్టాన్ని మిగిల్చిన ఆనాటి తుపాను కాళరాత్రిని తలుచుకుని కోనసీమ వాసులు నేటికీ భయభ్రాంతులకు గురవుతున్నారు.


తుపానుకు ఇళ్లు దెబ్బతినడంతో రోడ్లపైకి వచ్చిన బాధితులు (ఫైల్ ఫోటో)